## కేంద్ర మంత్రులను కలిసిన ఎమ్మెల్యే



కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్‌తో మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి,జనవరి : 18 కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్, కేంద్ర సమాచారం, బ్రాడ్ కాస్టింగ్ శాఖ, యువజన వ్యవహారాలు, క్రీడా శాఖల మంత్రి అనురాగ్ సింగ్ ఠాగూర్‌ను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం ఆధునీకరణ కోసం, ప్రహరీ, ట్రాకింగ్ గురించి నిధులు విడుదల చేయాలని వినతి పత్రం అందజేశారు.

## గుంట గుంటకూ నీరందించిన ఘనత పోచారానిదే..



మాట్లాడుతున్న ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సభ్యుడు సందీప్

నస్రుల్లాబాద్, జనవరి 18 : బాన్సువాడ నియోజక వర్గంలో గుంట గుంటకూ సాగు నీరు అందించిన ఘనత మాజీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిదే అని బీర్కూర్ ఎంపీపీ రఘు,ఎంపీటీసీ సందీప్ అన్నారు. గురువారం వారు బీర్కూర్‌లో విలేకరులతో మాట్లాడారు. బీర్కూర్ మండలం బైరాపూర్, దామరంచ, బీర్కూర్ తండా గ్రామాల్లో బుధవారం పర్యటించిన బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి నిజాంసాగర్ కాలువ 25,26 డిస్ట్రిబ్యూటర్ కాలువలపై అవాస్తవాలు మాట్లాడడం బాధాకరమన్నారు. 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో కాలువ నిర్మాణానికి ప్రతి పాదనలు పంపినా ఎలాంటి అనుమతులు, నిధులు మంజూరుకాలేదని గుర్తుచేశారు. స్వరాష్ట్రంలో పోచారం శ్రీనివాసరెడ్డి వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నపుడు 26/3 కాలువ వద్దకు వెళ్లి కేసీఆర్ ప్రభుత్వనికి ప్రతిపాదనలు పంపించగా.. రూ.కోటీ 50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కాలువను నిర్మించాలంటే బొప్పాస్‌పల్లి ప్రాంత రైతులకు చెందిన దాదాపు 60,70 ఎకరాల పంట పొలాల మధ్యలో నుంచి తీసుకురావాలని, నష్టపరిహారం చెల్లిస్తామని చెబితే వారు ఒప్పుకోకపోవడంతో పనులు నిలిచిపోయాయని వివరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు దుంపల రాజు, మన్నాన్, శంకర్ సింగ్, కొరిమె రఘు, శివ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 18 ఏండ్లు నిండిన వారు ఓటు హక్కును కలిగి ఉండాలి

### కలెక్టర్ జితేశ్ వీ పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, జనవరి 18 : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 25న బూత్ స్థాయి మొదలుకొని జిల్లా స్థాయి వరకు ఓటర్ల అవగాహనకు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ నెల 20, 21వ తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని, బూత్ స్థాయి అధికారులకు ఫారం 6, 7, 8లతో ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటారని అన్నారు. ఓటరు నమోదుతోపాటు అభ్యంతరాలకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ నెల 23న డివిజన్ స్థాయి, 24న జిల్లా స్థాయిలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించాలని సూచించారు. విజేతలకు నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రాలు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి, డీపీవో శ్రీనివాస్, జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి, విద్యాశాఖ ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్, డీఆర్డీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

**ప్రజల నుంచి వచ్చే అర్జీలను స్వీకరించాలని**

బాన్సువాడ, జనవరి 18 : ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను స్వీకరించాలని ఆర్డీవో భుజంగరావు అధికారులకు సూ చించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో గురువారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఎల్‌పీవోలతో ఆర్డీవో భుజంగరావు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, వర్ని, కోటగిరి, చందూర్, మోస్రా, రుద్రూర్, పోతంగల్ మండలాల్లోని బూత్ లెవల్ అధికారులతో మాట్లాడి సూచనలు చేశారు. ఓటర్ మార్పులు, చేర్పుల కోసం వచ్చే వారు ఫాం 6ను స్వీకరించాలని చెప్పారు. ఈ నెల 20, 21వ తేదీల్లో రెండు రోజులపాటు స్పెషల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ప్రజలనుంచి వచ్చే అర్జీలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్, బీర్కూర్ గిర్దావరి సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ఆయా మండలాల గిర్దావర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

**ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి**

మద్నూర్, జనవరి18: కేంద్ర ఎన్నికల సంఘం కొత్తగా ఓటరు నమోదుకు అవకాశం కల్పించినట్లు నాయబ్ తహసీల్దార్ భరత్ తెలిపారు. మండలంలోని బూత్ లెవెల్ అధికారులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులు దరఖాస్తులను స్వీకరించాలని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ విజయ్, గిర్దావర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన యువజనోత్సవాలు

కామారెడ్డి, జనవరి 18 : జిల్లా కేంద్రంలో ఏబీవీపీ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో గురువారం యువజనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా జిల్లా ప్రముఖ్ గిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో దాదాపుగా 650 మంది విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు పోటీలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్, విభాగ్ వ్యవస్థ ప్రముఖ్ స్వామి, నగర అధ్యక్షుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు వాహనాలకు వేలం

కామారెడ్డి, జనవరి 18 : జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి రవీందర్ ఆదేశాల మేరకు కామారెడ్డి, ఎక్సైజ్ పరిధిలో పట్టుబడిన ఆటో బేరింగ్ వాహనాలకు శుక్రవారం ఉదయం 11 గంటలకు కామారెడ్డి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాలకు ప్రారంభ ధర రూ.42 వేలు నిర్ణయించామని, జీఎస్టీ 18 శాతం అని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా రూ.5 వేల డిపాజిట్ చేసి తమ పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

## ఆశాజనకంగా మక్కజొన్న పంట



రామేశ్వర్‌పల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న ఏవో రాధారెడ్డి

బాన్సువాడ రూరల్, జనవరి 18 : బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్, కోనాపూర్, సంగోజీపేట్, కాద్లాపూర్ తండా, గోపాల్‌తండా, గ్రామాల్లో యాసంగిలో సాగు చేస్తున్న మక్కజొన్న పంట ఆశాజనకంగా ఉంది. సాగు చేస్తున్న మక్కజొన్న పంటలకు తెగుళ్ల సోకకపోవడం, వాతావరణం సమతుల్యంతో ఈ ఏడు మక్కజొన్న పంట బాగున్నదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కోనాపూర్ క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో దాదాపు రెండు వేల ఎకరాల్లో మక్కజొన్న పంటను సాగు చేస్తున్నట్లు ఏఈవో మీనా తెలిపారు. పంటల సాగులో రైతులకు ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నామని ఆమె తెలిపారు.

**వరి పంటను పరిశీలించిన ఏవో..**

భిక్కనూరు, జనవరి 18 : మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వరి పంటను మండల వ్యవసాయాధికారిణి రాధారెడ్డి గురువారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కాండం తొలుచు పురుగు నివారణకు ఒక ఎకరాకు 8 కేజీల కార్టఫ్ హైడ్రో క్లోరైడ్ గుళికలు వేసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏఈవో వినోద్‌గౌడ్, రైతులు తక్కల్ల నర్సారెడ్డి, తక్కల్ల బాపురెడ్డి, స్వామి, వంగెటి నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేపు పాల్వంచలో వైద్యశిబిరం

మాచారెడ్డి, జనవరి 18 : పాల్వంచ మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శుక్రవారం సరదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా న్యూరో క్యాంప్ నిర్వహించనున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు నర్సింహాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హాజరవుతారని తెలిపారు. గ్రామస్తులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఇంటి పన్ను చెల్లించాలి

బీబీపేట్, జనవరి 18 : మండలంలోని కోనాపూర్‌లో పంచాయతీ కార్యదర్శి భరత్ సిబ్బందితో కలిసి గురువారం ఇంటి పన్ను వసూలు చేశారు. ఇంటి పన్ను చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. ఆయన వెంట పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ఆవరణ శుభ్రం



పాఠశాల మైదానాన్ని శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి

బాన్సువాడ టౌన్, జనవరి 18 : పాఠశాలలో చదివే విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా పాఠశాల ఆవరణను శుభ్రం చేయించామని బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ గంగాధర్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తను మున్సిపల్ సిబ్బంది తొలగింపజేశారు. ఈ సందర్భంగా రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి మాట్లాడుతూ.. వచ్చే వారం గణతంత్ర్య దినోత్సవం ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించడానికి పాఠశాల ఆవరణ మొత్తాన్ని శుభ్రం చేయించామన్నారు. మున్సిపల్ కమిషనర్ రమేశ్, కౌన్సిలర్ శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మందిర్ స్వచ్ఛత అభియాన్

నస్రుల్లాబాద్, జనవరి 18 : బీర్కూర్ గ్రామ శివారులోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి యెండల లక్ష్మీనారాయణ మందిర్ స్వచ్ఛత అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుభ్రం చేశారు. అనంతరం నస్రుల్లాబాద్ మండలంలోని కంశెట్‌పల్లి గ్రామంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బీజేపి నాయకులు చందూరి హన్మాండ్లు, దొరబాబు, సున్నం సాయిలు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, జనవరి 18 : జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ లెక్చరర్స్ అసోసియేషన్ 2024 నూతన క్యాలెండర్‌ను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నీలం నర్సింహులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, సెక్రటరీ యాదన్న, ప్రధాన కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షుడు జయంత్, ట్రెజరరీ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీపై పాలిహౌస్‌ల ఏర్పాటు

### ఐకేపీ పీడీ సాయన్న



భూంపల్లిలో ఏర్పాటుచేసిన పాలిహౌస్‌ను పరిశీలిస్తున్న పీడీ సాయన్న

సదాశివనగర్, జనవరి 18: గ్రీన్ హౌస్‌లో భాగంగా సబ్సిడీపై పాలిహౌస్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ఐకేపీ పీడీ సాయన్న తెలిపారు. మండలంలోని భూంపల్లిలో రైతు మొగ్గం రాజేందర్ ఏర్పాటు చేసుకున్న పాలిహౌస్‌ను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. గ్రీన్ హౌస్ పథకంలో పాలిహౌస్ ఏర్పాటు కోసం రూ. లక్షా 20 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతు వాటా రూ.48 వేలు కట్టాలన్నారు. మిగితా డబ్బులు సబ్సిడీ రూపంలో రైతు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. పాలిహౌస్‌లో రైతులు కీరదోస, కూరగాయలు, పూలు పండించి అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రైతు రాజేందర్‌ను పీడీ అభినందించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాజిరెడ్డి, సీసీ గొర్రె రాములు, సీఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీ పరిశీలన

పిట్లం, జనవరి 18: మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకం, బ్యాగ్ ఫిల్లింగ్ పనులను ఎంపీడీవో వెంకటేశ్వర్, ఎంపీవో బ్రహ్మం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలన్నారు. ప్రతి మొక్కనూ సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

# వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు



భిక్కనూరు టోల్ ప్లాజా వద్ద అవగాహన కల్పిస్తున్న ఎస్సైసాయికుమార్, వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు

నిజాంసాగర్/భిక్కనూరు, జనవరి 18: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మండలంలోని మాగి గ్రామ శివారులో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా డ్రైవర్లు, వాహనదారులు, ప్రజలకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

అనంతరం నిజాంసాగర్ ఎస్సై రాజశేఖర్ పలు సూచనలు ఇచ్చా రు. నాయకుడు పండరి, హసన్‌పల్లి సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్, వొడ్డెపల్లి మాజీ సర్పంచ్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరు టోల్ ప్లాజా వద్ద రామేశ్వర్‌పల్లి గ్రామానికి వెళ్లేదారిలో వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై ఎస్సై సాయికుమార్, వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు అవగాహన కల్పించారు. రవాణా శాఖ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

సదాశివనగర్, జనవరి 18: ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సేవలు పొందుతున్న గర్భిణులకు ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్నదని డాక్టర్ ఆస్మా తెలిపారు. సదాశివనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలువురు గర్భిణులకు ఆమె గురువారం న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖానలో ప్రతినెలా 'అమ్మ ఒడి'లో భాగంగా ఉచితంగా పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ దవాఖానలో నార్మల్ డెలివరీలు చేస్తామని, తల్లీబిడ్డను 102 అంబులెన్స్‌లో ఇంటికి చేర వేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ దవాఖానల్లోని సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నాగరాజు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ ఆస్మా

## భాస్వరం లోప నివారణకు చర్యలు తీసుకోవాలి



పంటను పరిశీలిస్తున్న ఏవో నరేశ్

గాంధారి, జనవరి 18: మండలంలోని సీతాయిపల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో యాసంగిలో రైతులు సాగుచేస్తున్న పంటలను మండల వ్యవసాయాధికారి నరేశ్ గురువారం పరిశీలించారు. మక్కజొన్న పంటలో భాస్వరం లోపం ఉన్నదని, కాండం తొలుచు, కత్తెర పురుగులు ఆశించినట్లు గుర్తించారు. కాండం తొలుచు పురుగు నివారణకు ఎమ్మామెక్టిన్ బెంజోయేట్ ఐదు శాతం మందును ఎకరానికి వంద గ్రాముల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. లేదా క్లోరాన్ ట్రనిలిప్రోల్ 18.5 శాతం ఎస్ఎల్ మందును ఎకరానికి 60ఎం.ఎల్ పిచికారీ చేయాలన్నారు. ఏఈవో జ్యోత్స్న ఉన్నారు.

## ముంబాజీపేట్‌లో వికసిత్ భారత్

ఎల్లారెడ్డి, జనవరి 18: లింగంపేట మండలంలోని ముంబాజీపేట్ గ్రామంలో గురువారం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ నాయకుడు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆవిష్కరించారు. డ్రోన్ ద్వారా ఎరువుల పిచికారీని పరిశీలించారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED**

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## అభివృద్ధి పనుల గుర్తింపు

నిజాంసాగర్, జనవరి 18: నిజాంసాగర్‌లో 2024-25 సంవత్సరంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల గుర్తింపు కోసం గురువారం స్థానిక గ్రామ పంచాయతీలో గ్రామసభను ఏర్పాటుచేశారు. ఉప సర్పంచ్ అంజవ్వ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పలు పనుల విషయమై వార్డు సభ్యులు చర్చించారు. సీసీ రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, అంగడిబజార్‌లో నీటి సౌకర్యం కల్పించాలని తీర్మానించారు. సమావేశంలో నాయకుడు సందీప్ కుమార్, పంచాయతీ కార్యదర్శి గంగారాం, కారోబార్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.



తీర్మానాలను చదువుతున్న కార్యదర్శి గంగారాం

## ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం.. రాగి వైరు, కాయిల్స్ చోరీ



దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

నిజాంసాగర్, జనవరి 18: ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు మళ్లీ రెచ్చిపోయారు. మండలంలోని గోర్గల్ గ్రామ శివారులో దొంగలు రెండు ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం రాత్రి ధ్వంసం చేశారు. అందులో ఉన్న రాగి వైరు, కాయిల్స్, ఆయిల్‌ను చోరీ చేశారు. గురువారం ఉదయం పంట పొలాల వద్దకు వెళ్లిన రైతులు సత్యవ్వ, పోచయ్య అక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే విషయాన్ని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌గౌడ్‌కు సమాచారం ఇవ్వగా.. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న సుమారు.లక్షా50వేలు విలువ చేసే కాయిల్స్, వైరు, ఆయిల్ చోరీకి గురైనట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజశేఖర్ గౌడ్ తెలిపారు.

## బాలింతలు, చిన్నారుల సౌలభ్యం కోసమే మినీ అంగన్‌వాడీల అప్‌గ్రేడ్

బాన్సువాడ టౌన్, జనవరి 18: అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని బాలింతలు, చిన్నారులకు మరింత సౌలభ్యంగా ఉండేందుకు మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసినట్లు సీడీపీవో కళావతి తెలిపారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో నస్రుల్లాబాద్ మండలానికి చెందిన మూడు మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులను అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీవో అందజేశారు. కేకే తండా అంగన్‌వాడీ టీచర్ సునీత, నాచుపల్లి తండా ఈరాబాయి, రాములుగుట్ట తండా స్వరూపకు ఉత్తర్వుల కాపీలను సీడీపీవో అందజేశారు. కార్యక్రమంలో నస్రుల్లాబాద్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, సీనియర్ అసిస్టెంట్ రాములు పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ఎల్లారెడ్డి, జనవరి 18: ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బాన్సువాడ లయన్స్ కంటి దవాఖాన ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 67 మందిని వైద్యులు పరీక్షించి.. వారిలో 11మందికి మోతిబిందు ఉన్నట్లు గుర్తించారు. వారిని ఆపరేషన్ నిమిత్తం బాన్సువాడలోని లయన్స్ కంటి దవాఖానకు తరలించారు. వైద్యులు రవీంద్రమోహన్, సంగీత్ కుమార్, నేత్ర వైద్య నిపుణుడు హరికిషన్ పాల్గొన్నారు.

## మొక్కలు ఎండిపోకుండా చూడాలి



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి

గాంధారి, జనవరి 18: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని గాంధారి ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని గురువారం ఆయన పరిశీలించారు. మొక్కలకు ప్రతిరోజూ నీరు పోస్తూ.. కలుపు మొక్కలను తొలగించాలన్నారు. మొక్కలు జూన్ నెలలో నాటడానికి సిద్ధంగా ఉంచాలన్నారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే పంచాయతీ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.